సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం । 17 । ఏప్రిల్ । 2024

I



ధర లేక 'చింత'

ఈ ఏడాది చింతపండుకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. - IIలో



అమ్మకానికి ఆడశిశువు

శిశువును అమ్మకానికి పెట్టి.. డబ్బులు సంపాదించాలని చూసిన ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. - IIలో



నేడు సీతారాముల కల్యాణం

యాదాద్రిలోని శివాలయంలో సీతారామ చంద్రస్వామికి మంగళవారం రాత్రి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. - IIలో

న్యూస్‌రీల్

భానుడి ప్రతాపం

- అత్యధికంగా బొమ్మలరామారంలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

భువనగిరిటౌన్: జిల్లాలో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతోంది. మొన్నటివరకు వాతావరణం కాస్త చల్లబడగా రెండు రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 7 గంటల తర్వాత జనం బయటకు రావాలంటే భయపడిపోతున్నారు. మండే ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధ్యాహ్నం సమయంలో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. బుధవారం, గురువారం జిల్లాలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. దీంతోపాటు వడగాలుల ముప్పు పొంచి ఉందని పేర్కొంటున్నారు. ప్రధానంగా బుధవారం కొన్ని మండలాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇక.. మంగళవారం అత్యధికంగా బొమ్మలరామారంలో 44 డిగ్రీలు, యాదగిరిగుట్టలో 43 డిగ్రీలు, మోత్కూర్‌లో 42.3, నారాయణపురం 41.7, ఆలేరు 41.7, చౌటుప్పల్‌లో 41.6, వలిగొండ 41.6, భువనగిరి 41.4, రామన్నపేట 41.4, అడ్డగూడూరు, ఆత్మకూర్‌లలో 40 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బీబీనగర్, మోటకొండూర్ మినహా జిల్లాలో అన్ని మండలాలు ఆరెంజ్ అలెర్ట్‌లోనే ఉన్నాయి.

ఉపాధి కూలీలు జాగ్రత్తలు పాటించాలి



పల్లె ప్రకృతివనాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ సురేష్ కుమార్

భువనగిరి రూరల్: వేసవిలో ఉపాధి కూలీలు జాగ్రత్తలు పాటించాలని డీఆర్‌డీఓ సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం భువనగిరి మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో పల్లె ప్రకృతివనాన్ని సందర్శించారు. అనంతరం ఉపాధి హామీ పనులు, ఉపాధి కూలీల దినసరి హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఎండలు పెరుగుతున్నందున కూలీలకు సదుపాయాలు కల్పించాలని, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ బాలస్వామి, పంచాయతీ కార్యదర్శులు పద్మారెడ్డి, టీపీ శేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ కౌసల్య తదితరులు ఉన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. అంజనీపుత్రుడికి ఇష్టమైన రోజు కావడంతో ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. హనుమంతుడికి నైవేద్యం సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా చేపట్టారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం జరిపించి, సాయంత్రం వెండి జోడు సేవ పూజలు నిర్వహించారు.

మందకృష్ణను విమర్శించే అర్హత రేవంత్‌కు లేదు



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తుంగతుర్తి: మందకృష్ణ మాదిగను విమర్శించే అర్హత సీఎం రేవంత్‌రెడ్డికి లేదని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఉమ్మడి నల్లగొండ జిల్లా కోఆర్డినేటర్, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందుకూరి సోమన్న మాదిగ అన్నారు. మంగళవారం తుంగతుర్తి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ జన జాతర సభలో వచ్చి అబద్ధాలు మాట్లాడి మాదిగలకు నమ్మకద్రోహం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాల్వాయి బాలయ్య, ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి సైదులు, వీహెచ్‌పీఎస్ జాతీయ కార్యదర్శి ఖాసీం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే. జండగే

ఎన్నికల ఖర్చు నమోదు చేయాలి

- కలెక్టర్ హనుమంతు కే. జండగే

సాక్షి,యాదాద్రి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎన్నికల ఖర్చును కచ్చితంగా నమోదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జండగే అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో భువనగిరి పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఎన్నికల అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్స్, అకౌంటింగ్ టీం సభ్యుల అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. వీడియో సర్వేలైన్స్ టీములు క్షేత్రస్థాయిలో తీసిన వీడియోలను వీడియో వ్యూవింగ్ టీంలు క్షుణ్ణంగా పరిశీలించి, అకౌంటింగ్ టీంలకు పంపాలని, అకౌంటింగ్ టీంలు వాటి వివరాల ప్రకారం రేట్ కార్డు ధరలతో వ్యయాన్ని నమోదు చేయాలన్నారు. ఐటీ, జీఎస్టీ, బ్యాంకింగ్, ఎంసీఎంసీ, ఎక్సైజ్ తదితర రిపోర్టులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఎన్నికల పరిశీలనకు వచ్చే ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్లకు నివేదికలు సమర్పించాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, ఆర్డీఓ అమరేందర్, జిల్లా ఎక్స్‌పెండీచర్ నోడల్ అధికారి, జిల్లా పరిశ్రమల అధికారి రాజేశ్వర్‌రెడ్డి, అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేద పండితుడి రాజీనామా

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో వేద పండితుడు సీతారామచార్యులు తన విధులకు రాజీనామా చేశారు. ఈమేరకు రాజీనామా పత్రాన్ని ఆలయాధికారులకు గత వారం రోజుల క్రితమే అందజేసినట్లు తెలిసింది. ఈవిషయంపై డీఈఓ భాస్కర్‌శర్మను వివరణ కోరగా.. రాజీనామా చేసిన విషయం నిజమేనని వెల్లడించారు. కాగా.. రెండేళ్ల క్రితం దేవాదాయశాఖ నియామకాల్లో భాగంగా సీతారామచార్యులు యాదాద్రి ఆలయానికి వేద పండితులుగా వచ్చారు. ఆయన ఎందుకోసం రాజీనామా చేశారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. సీతారామచార్యులను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. అమెరికాలో ఉండే ఆయన గురువు వద్ద పూజాది కార్యక్రమాలు నిర్వహించడానికి వెళ్లినట్లు ఆలయ అధికారులు చెబుతున్నారు.

ప్రచారంలో నయా ట్రెండ్

- సోషల్ మీడియాను ప్రచారాస్త్రంగా వాడుకుంటున్న పార్టీలు
- ఫేస్‌బుక్, వాట్సాప్‌లో సందేశాలు
- బల్క్ పోస్టింగ్‌లతో దూసుకుపోతున్న అభ్యర్థులు
- టెలి కాన్ఫరెన్స్‌లతో కార్యకర్తలకు మార్గనిర్దేశం



సాక్షి, యాదాద్రి: లోకసభ ఎన్నికల ప్రచారానికి రాజకీయ పార్టీలు నయా ట్రెండ్ ఫాలో అవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో సోషల్ మీడియా ట్రెండ్ మంచి ఫలితాలు ఇచ్చింది. తాజాగా ఎంపీ ఎన్నికల్లోనూ ఆయా పార్టీలు, అభ్యర్థులు సోషల్ మీడియాను వాడేస్తున్నారు. ఇందుకోసం ఫేస్‌బుక్, ఎక్స్(ట్విట్టర్) వాట్సాప్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ఓటర్లకు దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. గురువారం నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభం అవుతుండడంతో అభ్యర్థులు సోషల్‌మీడియా ప్రచారానికి మరింత పదును పెడుతున్నారు.

ఓటర్లను నేరుగా కలిసే సమయం లేకపోవడంతో..

అభ్యర్థులు తమ బలాబలాలతోపాటు ప్రత్యర్థుల బలహీనతలను ప్రచార మాధ్యమాల ద్వారా ఓటర్లకు చేరవేస్తున్నారు. సమయం తక్కువగా ఉండడం, అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా అభ్యర్థి గ్రామగ్రామానికి వెళ్లి ఓటర్లను కలిసే సమయం లేకపోవడంతో సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించుకుంటున్నారు. ఇందుకోసం ఏజెన్సీలతో కాంట్రాక్ట్ మాట్లాడుకుని ప్రచార బాధ్యతలను అప్పగిస్తున్నారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలో 18 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. వీరిలో కనీసం 14 లక్షల మంది ఓటర్లకు ఇంటర్నెట్ సదుపాయం ఉన్న సెల్‌ఫోన్‌లు ఉండగా, వారి నంబర్లు పార్టీల అభ్యర్థులు సేకరించారు. యువత, మహిళలు, ఉద్యోగ, వ్యాపారాలతో బిజీగా ఉండే వారిని కలిసి ఓటు అడగడానికి అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారు.

లైవ్‌లో ప్రచారాలు

సోషల్ మీడియాలో పార్టీల ప్రచారాలు నేరుగా లైవ్ ఇస్తున్నారు. యూట్యూబ్, ఎక్స్, ఫేస్‌బుక్ లలో లైవ్ ప్రచారం ఇస్తున్నారు. టీవీలో వచ్చే సమయానికంటే ముందుగానే లైవ్‌లో వచ్చేస్తోంది. అభ్యర్థుల ప్రసంగాలు లైవ్‌లో ప్రసారం చేస్తున్నారు. వీటికి వేల నుంచి లక్షల్లో వ్యూస్ వస్తున్నాయి. ఎప్పటికప్పుడు ఓటర్లు కామెంట్ పెట్టి తమ అభిప్రాయాలను సైతం ముక్కుసూటిగా చెప్పేస్తున్నారు. కొన్ని సార్లు నెటిజన్లు అభ్యర్థుల తప్పిదాలను కూడా ఎండగడుతున్నారు.

టెలికాన్ఫరెన్స్‌లో సమావేశాలు

అభ్యర్థులు టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారు. ఒకే సారి వందల మందితో సమావేశాలు నిర్వహించి సమాచారాన్ని చేరవేస్తున్నారు. సమాచార విస్తరణకు సులభంగా జరుగుతున్న సోషల్ మీడియా గ్రూపులు కూడా ఈ ఎన్నికల్లో తారాస్థాయిలో పనిచేస్తున్నాయి.

ఊపందుకోనున్న ప్రచారం

నామినేషన్లు ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో సోషల్ మీడియా ప్రచారం మరింత ఊపందుకోనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా సోషల్‌మీడియా ప్రచార దళాలను ఏర్పాటు చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఏజెన్సీలను నియమించుకున్నారు. అభ్యర్థి రోజువారీ ప్రచార షెడ్యూల్, ప్రచారంలో ఇచ్చే ఉపన్యాసాలు, ఇతర ముఖ్య అంశాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. పండుగల సమయంలో అభ్యర్థులు శుభాకాంక్షల మెసేజ్‌లు ఓటర్లకు పంపిస్తున్నారు.

స్మార్ట్ ఫోన్లలో సందేశాలు

ఓటర్లలో ఎక్కువ మందికి స్మార్ట్‌ఫోన్‌లు ఉన్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన పార్టీలు అభ్యర్థులు తమ పార్టీ, గుర్తు, గెలిపిస్తే చేసే సేవలు, అభివృద్ధి పనులు వగైరా వంటివి బల్క్ పోస్టింగ్‌ల రూపంలో పంపిస్తున్నారు. ఇలా ప్రధాన పార్టీలైన బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు సోషల్ మీడియాను వాడుకుంటున్నాయి. అంతేకాకుండా పార్టీల వద్ద ఉన్న సెల్‌ఫోన్ నంబర్లతో కమ్యూనిటీ గ్రూపులు, బ్రాడ్ కాస్ట్ గ్రూపులు, వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేశారు. దీంతోపాటు గ్రామస్థాయి, వార్డు స్థాయి, కుల సంఘాలు, యువజన సంఘాలు, పరపతి సంఘాలు, మహిళా సంఘాలు ఇలా పలు రకాల వాట్సాప్ గ్రూపులు, దీంతోపాటు బ్రాడ్‌కాస్ట్ గ్రూపులకు ఒకే సారి మెసేజ్‌లు పంపిస్తున్నారు.



మాట్లాడుతున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పక్కన భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

కేసీఆర్‌తో పాటు జగదీశ్‌రెడ్డి జైలుకే

- బీఆర్‌ఎస్ అంటేనే అలీబాబా దొంగల ముఠా
- 21న చామల నామినేషన్‌కు సీఎం, మంత్రి వెంకట్‌రెడ్డి వస్తారు
- ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

సాక్షి,యాదాద్రి, భువనగిరిటౌన్: మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంతో పాటు సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి కూడా జైలుకు వెళ్లడం ఖాయమని మునుగోడు ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానికంగా నిర్వహించిన భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014లో అద్దె ఇంట్లో ఉన్న జగదీశ్ రెడ్డికి రూ.వేయి కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. వచ్చే బతుకమ్మ పండుగను ఎమ్మెల్సీ కవిత తీహార్ జైలులోనే జరుపుకోబోతుందన్నారు. బీఆర్ఎస్ అంటేనే అలీబాబా దొంగల ముఠా అని విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఆగమైన తెలంగాణను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇప్పుడిప్పుడే దారికి తెస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించే బాధ్యత తమదే అన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అన్నదమ్ములుగా తాము ఇద్దరం కలిసి అండగా ఉంటామన్నారు. ఆపదొచ్చినా సాపద వచ్చినా ఏ సమయంలోనైనా పేదలకు తాము సాయం చేస్తామని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో చామల కిరణ్ కుమార్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. 21 తేదీన చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రానున్నారని, ప్రజలు పెద్దఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ కార్యకర్తలను గుండెలో పెట్టుకుని చూసుకుంటామని తెలిపారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో అత్యధిక ఎంపీ స్థానాలు కైవసం చేసుకుని కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ప్రజాపాలన కొనసాగిస్తుందని తెలిపారు. ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కొంత మంది తనను లోకల్ కాదని దుష్ప్రచారం చేస్తున్నారని, కానీ తనది లోకల్ అని పేర్కొన్నారు. బీజేపీ నుంచి దేశాన్ని, ప్రజలను కాపాడే బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. కాగా.. సభ ప్రారంభం ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులను స్టేజీపైకి పిలుస్తున్న క్రమంలో ప్రొటోకాల్ పాటించడం లేదని కొంత మంది కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. భువనగిరి ఎమ్మెల్యే కలుగజేసుకుని సర్దిచెప్పడంతో సద్దుమణిగింది. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవ, మాజీ జెడ్పీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ సురభీవాణి, పీసీసీ డెలిగేట్ తంగళ్లపల్లి రవికుమార్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ నీలం పద్మ, మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, డీసీసీ ఉపాధ్యక్షులు పచ్చిమట్ల శివరాజ్‌గౌడ్, సామ మధుసూదన్‌రెడ్డి, కుంభం కీర్తిరెడ్డి, పోత్నక్ ప్రమోద్‌కుమార్, రామాంజనేయులు గౌడ్, బర్రె జహంగీర్, చిక్కుల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కాంగ్రెస్ శ్రేణులు

సివిల్స్‌లో ధీరుడు

- యూపీఎస్సీ ఫలితాల్లో 173వ ర్యాంకు సాధించిన అల్వాల వాసి
- నాలుగో ప్రయత్నంలో సక్సెస్ అయిన ధీరజ్‌రెడ్డి
- తల్లిదండ్రుల కలను నెరవేర్చిన యువకుడు



తల్లిదండ్రులు, సోదరితో ధీరజ్‌రెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): సివిల్స్ సాధించాలన్న తల్లిదండ్రుల కలలను నెరవేర్చడానికి ఆ యువకుడు అహర్నిశలు కష్టపడి చదివాడు. మూడు సార్లు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. అయినా నిరాశ చెందకుండా నాలుగోసారి ప్రయత్నించి సక్సెస్ అయ్యాడు. అతనే నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం అల్వాలకు చెందిన పెంకీసు ధీరజ్ రెడ్డి. మంగళవారం ప్రకటించిన యూపీఎస్సీ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 173వ ర్యాంక్ సాధించాడు. పెంకీసు సత్యనారాయణ, హేమలత దంపతుల కుమారుడైన ధీరజ్‌రెడ్డి ప్రాథమికోన్నత విద్యాభ్యాసం నల్లగొండలో, ఇంటర్ నుంచి డిగ్రీ వరకు హైదరాబాద్‌లో కొనసాగింది.

ప్రజాసేవ చేయాలని..

ధీరజ్ తండ్రి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్‌గా, తల్లి స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో అతడిని సివిల్స్‌వైపు అడుగులు వేసేలా వెన్నంటి ప్రోత్సహించారు. హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకుంటూ ప్రయత్నాలు మొదలు పెట్టాడు. 2019, 2021, 2022లో మూడు పర్యాయాలు ప్రయత్నించి విఫలమయ్యాడు. అయినా అతడు వెనకడుగు వేయలేదు. ప్రజాసేవ చేయాలనే తలంపుతో సడలని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాడు. అమ్మానాన్నలతో పాటు స్నేహితుల తోడ్పాటుతో ఐదేళ్లుగా ప్రిపరేషన్ కొనసాగిస్తూనే ఉన్నాడు. రోజూ 8 నుంచి 10 గంటల పాటు చదివేవాడు. నాలుగో ప్రయత్నంలో విజయం ఆయన సొంతమైంది. ఆలిండియా స్థాయిలో 173వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా ధీరజ్ రెడ్డి మాట్లాడుతూ తాను ఐపీఎస్‌కు ఎంపికయ్యే అవకాశం ఉందని మరో సారి ప్రయత్నించి ఐఏఎస్ సాధిస్తానని ధీమా వ్యక్తం చేశాడు.

విద్యను ఆస్తిగా ఇవ్వాలి

తల్లిదండ్రులు పిల్లలకు విద్యను ఆస్తిగా ఇవ్వాలి. చదువు అనేది చాలా విలువైనది. పిల్లలకు తల్లిదండ్రుల నుంచి ప్రోత్సాహం లభించినప్పుడే ఏదైనా సాధించగలను అనే నమ్మకం వారిలో కలుగుతుంది.

– సత్యనారాయణరెడ్డి, ధీరజ్‌రెడ్డి తండ్రి

కళాశాల హాస్టల్‌లో ఆహార పదార్థాల పరిశీలన

బీబీనగర్: ప్రభుత్వ హాస్టల్స్‌లో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ సంఘటనలు చోటు చేసుకుంటుండడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం బీబీనగర్ మండలంలోని గురుకుల మహిళా ఆర్మీ డిగ్రీ కళాశాల హాస్టల్‌లోని విద్యార్థులకు వండిన ఆహార పదార్థాలను బీబీనగర్ పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పరిశీలించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు యాదగిరి, సిబ్బంది సరోజ, శ్రీలత, ప్రభాకర్, శేఖర్‌రెడ్డి, కవిత, కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగ శర్మ, అధ్యాపకులు ఉన్నారు.



వంటలు పరిశీలిస్తున్న వైద్యులు

విద్యార్థి మృతితో జిబ్లక్‌పల్లిలో విషాదం

భూదాన్‌పోచంపల్లి: కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన చిన్నలచ్చి ప్రశాంత్(12) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందడంతో భూదాన్ పోచంపల్లి మండలం జిబ్లక్‌పల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నిరుపేద కుటుంబానికి చెందిన చిన్నలచ్చి మహేశ్, పారిజాత దంపతులకు కుమార్తె మైత్రి, కుమారులు ప్రశాంత్, శివప్రసాద్ ఉన్నారు. తండ్రి బోరు బండి డ్రైవర్‌గా చేస్తున్నాడు. తల్లి గ్రామంలో కూలీ పనులకు వెళ్తుంది. ప్రశాంత్ భువనగిరిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. అతను ఈ నెల 7న ప్రశాంత్ తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఉగాది పండుగకు వస్తానని వచ్చి తీసుకెళ్లాలని కోరగా.. ఈ నెల 20న గ్రామంలో బొడ్రాయి పండుగ ఉందని అప్పుడు తీసుకెళ్తానని తల్లి కుమారుడికి నచ్చజెప్పింది. అంతలో ఇలా అయిందని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రశాంత్ రెండు, మూడు రోజులుగా విరేచనాలు చేసుకుంటున్నా తమకు కనీసం సమాచారం ఇవ్వలేదని, మెరుగైన వైద్య సదుపాయం అందించలేదని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యంతోనే తమ కుమారుడు మృతిచెందాడని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

ప్రైవేట్ కాలేజీల అడ్మిషన్ల వేట

- టెన్త్ ఫలితాలు రాకముందే ఇంటర్‌లో ముందస్తు అడ్మిషన్లు
- విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు
- ఫీజు రాయితీల పేరుతో వల



భువనగిరి: జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రైవేట్ కళాశాలలు అడ్మిషన్ల వేట ప్రారంభించాయి. కాలేజీల యాజమాన్యాలు ప్రత్యేకంగా పీఆర్‌ఓలను నియమించుకుని ప్రవేశాల కోసం విద్యార్థులకు గాలం వేస్తున్నాయి. కూలీ పనులు చేసైనా సరే తమ పిల్లలను మంచి కళాశాలలో చదివించాలనే ఆలోచనతో ఉన్న తల్లిదండ్రులను కార్పొరేట్ కళాశాలలు ఆసరాగా చేసుకుంటున్నాయి.

ఫీజు రాయితీలతో ఆకట్టుకునేలా..

కార్పొరేట్ కళాశాలలు నియమించుకున్న పీఆర్‌ఓలు విద్యార్థుల ఇళ్ల వద్దకు క్యూ కడుతున్నారు. వీరు పాఠశాలలకు వెళ్లి విద్యార్థుల వివరాలు, ఫోన్ నంబర్లు, చిరునామా సేకరిస్తున్నారు. వివరాలు ఇచ్చినందుకు పాఠశాలల యాజమాన్యాలకు విందులు, నజరానాలు సమకూర్చుతున్నారు. నిబంధనల ప్రకారం విద్యార్థుల వివరాలు ఎవరికి ఇవ్వకూడదు. కానీ కాసులకు కక్కుర్తి పడి కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ఈ విధంగా వ్యవహరిస్తున్నాయి. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఫీజులో రాయితీ కల్పిస్తామని, బ్రోచర్లు ఇచ్చి వారి కళాశాలల గురించి వివరిస్తున్నారు. విద్యార్థుల అడ్మిషన్లను ముందస్తుగా బుక్ చేస్తుండడంతో కమిషన్లు వచ్చే అవకాశం ఉండటంతో పీఆర్‌ఓలు తల్లిదండ్రులపై ఒత్తిడి పెంచుతున్నారు. ఒక్కో విద్యార్థి పై రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు కమిషన్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

అయోమయంలో తల్లిదండ్రులు

పదో తరగతి వార్షిక పరీక్షలు రాసి మంచి మార్కులు సాధిస్తారని అంచనాలు పెట్టుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ కళాశాల సిబ్బంది చేసే ఫోన్ కాల్స్‌తో విసుగు చెందుతున్నారు. ఒకవేళ ఫోన్ లిఫ్ట్ చేయకపోతే వారే ఇంటి దగ్గర వాలుతున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు అయోమయానికి గురవుతున్నారు.

నిబంధనలు పాటించాలి

ఇంటర్ కళాశాలలో ప్రస్తుతం ప్రవేశాల ప్రక్రియ లేదు. ఇంటర్ బోర్డు ప్రకటించిన నిబంధనల ప్రకారమే అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగించాలి. నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు, ప్రవేశాల ప్రక్రియ నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం. ఇంటర్ బోర్డు ప్రకటించిన తర్వాతే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించాలి.

– రమణి, డీఐఈఓ

నిబంధనలకు విరుద్ధంగా..

పదో తరగతి పరీక్ష ఫలితాలు వెలువడిన తర్వాత మే, జూన్ నెలలో అడ్మిషన్లు ప్రారంభించాలి. అయితే నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాల ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఈ వ్యవహారం గత రెండు నెలల ముందు నుంచే ప్రారంభమైంది. ప్రస్తుతం అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టవద్దని ఇప్పటికే ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. అయినా బోర్డు నిబంధనలు పట్టించుకోకుండా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ప్రక్రియను కొనసాగిస్తున్నారు.

క్లుప్తంగా

నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ

నల్లగొండ రూరల్: నిరుద్యోగులకు శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ నిర్వాహకురాలు ఆల్‌మస్ ఫర్హీన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంప్యూటర్ ఆపరేటర్, కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, సాఫ్ట్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, టైపింగ్, సెక్టార్ రెడీనెస్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై రెండు నెలలు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. టెన్త్, డిగ్రీ(పాస్/ఫెయిలై) చదివి, 35ఏళ్ల లోపు గల వారు ఈ నెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 7032649925, 9177785283 నంబర్లను సంప్రదించాలన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య


వంశీ (ఫైల్)

మునుగోడు : పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. మునుగోడు మండలంలోని కోతులారం గ్రామానికి చెందిన పగిళ్ల వంశీ(21) లారీ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం లారీ డ్యూటీ దిగి ఇంటికి వచ్చిన వంశీ మంగళవారం మంగళవారం ఉదయం 10గంటల వరకు ఇంటి వద్దే ఉండి ఆ తర్వాత కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటకు వెళ్లాడు. ఏమైందో ఏమో కానీ సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి సమీపంలో ఇటుక బట్టీల వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి మధ్యాహ్న సమయంలో కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి 'నేను పురుగుల మందు తాగాను' అని చెప్పాడు. వెంటనే అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు వంశీని హైదరాబాద్‌కు తరలించగా.. అప్పటికే మృతిచెందాడు. వంశీ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ధర లేక 'చింత'

- చింతపండుకు మార్కెట్‌లో డిమాండ్ లేక రైతుల దిగాలు
- గత ఏడాది క్వింటాకు రూ.14వేల పైచిలుకు ధర
- ఈ ఏడాది రూ.6వేలు నుంచి రూ.8వేలు మాత్రమే


భువనగిరి మార్కెట్‌కు వచ్చిన చింతపండు

భువనగిరి : చింతపండుకు ఈ ఏడాది గిట్టుబాటు ధర లేక రైతులు దిగాలుపడుతున్నారు. మార్కెట్‌లో సరైన ధర రాకపోవడంతో రైతులు, వ్యాపారులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. వ్యాపారులు చెల్లించే ధరతో రవాణా, కూలీలకే సరిపోతుందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం సీజన్ కావడంతో గతకొద్ది రోజుల నుంచి భువనగిరి మార్కెట్‌కు వివిధ ప్రాంతాల నుంచి చింతపండును విక్రయించుకునేందుకు రైతులు తీసుకవస్తున్నారు.

ఆయా ప్రాంతాల నుంచి రాక..

చింతపండు భువనగిరి మార్కెట్‌కు జిల్లాలోని రాజాపేట, బొమ్మలరామారం, తుర్కపల్లి, ఆత్మకూర్, మోత్కూర్, భువనగిరి, వలిగొండ, మోటకొండూరు, గుండాల, అడ్డగూడూరుతో పాటు సిద్దిపేట జిల్లాలోని జగదేవ్‌పూర్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి విక్రయించేందుకు తీసుకువస్తుంటారు.

ఆందోళనలో రైతులు, వ్యాపారులు..

మార్కెట్‌కు రైతులతో పాటు కొంత మంది వ్యాపారులు చింతపండును విక్రయించేందుకు తీసుకువస్తారు. ఇందులో బేరగాళ్లు చెట్లను పట్టి వాటి నుంచి చింతపండును తీసుకుంటారు. వారు ఆయా చెట్లను సుమారు రూ. 7వేల నుంచి రూ.20వేల వరకు గుత్తకు తీసుకుని చెట్టు నుంచి చింతపండును తెంపేందుకు రోజుకు రూ.1000 నుంచి రూ.1200లు చెల్లిస్తున్నారు. చింతపండు వేరడానికి ఒక్కో కూలికి సుమారు రూ.350నుంచి రూ.400వరకు చెల్లిస్తున్నారు. ఎండిన అనంతరం చింతపండు నుంచి గింజలను వేరుచేసి గంపకు రూ.150గా చెల్లిస్తున్నారు. అనంతరం మార్కెట్‌కు తరలించే వరకు మొత్తంగా సుమారు రూ. 4500 నుంచి రూ.5వేల వరకు ఖర్చు వస్తుంది. ప్రస్తుతం భువనగిరి మార్కెట్‌లో చింతపండు నాణ్యతను బట్టి రూ.6500నుంచి రూ.8వేల వరకు చెల్లిస్తున్నారు. దీంతో రైతులతో పాటు చెట్లను గుత్తకు తీసుకున్న బేరగాళ్లు దిగాలు చెందుతున్నారు.

గత ఏడాది రూ.14వేలు..

గత ఏడాది భువనగిరి మార్కెట్‌లో క్వింటా చింతపండు రూ.8వేల నుంచి రూ.14వేల వరకు చెల్లించారు. గత ఏడాది అధికంగా కొనుగోలు చేసిన వ్యాపారులు నిల్వలు చేసుకోవడంతో ప్రస్తుతం కొత్త చింతపండును కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో ఈ ఏడాది క్వింటాలుకు రూ.6వేల నుంచి రూ.8వేల వరకు మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో చింతపండును చెట్ల మీదగానే వదిలివేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

ఖర్చులకైనా రావడం లేదు



మా పొలం వద్ద ఆరు చింత చెట్లు ఉన్నాయి. ఈ సారి చెట్లకు దిగుబడి కూడా తక్కువగానే ఉంది. చెట్ల నుంచి చింతపండును తెంపడం నుంచి మొదలు విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకెళ్లే వరకు అయ్యే ఖర్చు ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో చింతపండుకు ధర గత ఏడాది కంటే తక్కువగా ఉంది. డబ్బులు అవసరం ఉండడంతో తక్కువ ధరకే విక్రయించుకోవాల్సి వస్తోంది. ఇంకా చింతపండు ఉంది. కాని తక్కువ ధర ఉండటంతో గిట్టుబాటుకావడంతో లేదు.

– అనసూయ, రైతు కుర్రారం, రాజాపేట మండలం

చింతపండు నల్లగా ఉందని ధర తక్కువ చెల్లిస్తున్నారు



చింతపండు నాణ్యతను బట్టి ధర చెల్లిస్తున్నారు. కూలీలను పెట్టి, రవాణా ఖర్చు భరించి చివరికి మార్కెట్‌కు విక్రయించేందుకు పండును తీసుకవస్తే ఇక్కడ ధర తక్కువగా చెల్లిస్తున్నారు. చింతపండు నల్లగా ఉందని సాకుతో క్వింటాకు రూ.6వేలు చెల్లించారు.

– మల్లారెడ్డి, రైతు వర్టూరు, మోటకొండూరు మండలం

కాంగ్రెస్ పాలనలో రైతులు ఆగం

- సాగు, తాగునీరు, విద్యుత్ సమస్యలతో ప్రజలు సతమతం
- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలి
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

దేవరకొండ: రాష్ట్రంలో పాలన అగమ్యగోచరంగా తయరైందని, పంటలు ఎండిపోయి అన్నదాతలు ఆగమయ్యారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మేము గేట్లు ఎత్తితే బీఆర్‌ఎస్‌లో ఎవరూ మిగలరని మాట్లాడే కాంగ్రెస్ నాయకులు.. ఎత్తాల్సింది పార్టీ గేట్లు కాదు.. ప్రాజెక్టుల గేట్లు ఎత్తి రైతులకు సాగునీరందించాలన్నారు. మంగళవారం దేవరకొండ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అధ్యక్షతన నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి జగదీష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పంటలు ఎండిపోతే ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడు పట్టించుకోలేదని విమర్శించారు. రైతులకు రుణమాఫీ చేయకపోవడంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. రాష్ట్రంలో 200మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే ప్రభుత్వానికి చలనం లేకుండా పోయిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో సాగు, తాగునీటి సమస్యలతో పాటు విద్యుత్ సమస్యలు మళ్లీ దాపురించాయని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు సాగు, తాగునీటి కష్టాలు రాకుండా చర్యలు తీసుకున్నట్లు ఆయన గుర్తుచేశారు. ఎండిన పొలాలను కేసీఆర్ స్వయంగా పరిశీలించి రైతుల బాధలు విన్నారని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో దేవరకొండ నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చెందిందన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, నాయకులు నరసింహారెడ్డి, గాజుల ఆంజనేయులు, వడ్త్య రమేష్ నాయక్, టీవీఎన్ రెడ్డి, నేనావత్ కిషన్‌నాయక్, బిల్యానాయక్, పల్లా ప్రవీణ్ రెడ్డి, సునితాజనార్దన్‌రావు, ఏడ్పుల గోవిందు, వల్లపురెడ్డి, చింతపల్లి సుభాష్, కంకణాల వెంకట్ రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, ఆయా మండలాల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోన్ ఇప్పిస్తానని నమ్మించి టోకరా

రామన్నపేట: సైబర్ నేరస్తులు లోన్ ఇప్పిస్తానని నమ్మించి ఓ వ్యక్తి నుంచి రూ.37,900 కాజేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలంలోని పల్లివాడ గ్రామానికి చెందిన నాంపల్లి శ్రీనుకి మార్చి 23న గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి రూ.10లక్షల లోన్ ఇప్పిస్తానని నమ్మించాడు. ఖర్చుల కోసం రూ.12వేలు తన ఖాతాకు పంపమని చెప్పాడు. ఇది నిజమని నమ్మిన శ్రీను రూ.11,900 ఆ వ్యక్తికి పంపాడు. మరుసటిరోజు మరికొంత డబ్బు కావాలని చెప్పడంతో మరో రూ.26వేలు పంపాడు. డబ్బు పంపిన తర్వాత సదరు వ్యక్తికి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో తాను మోయపోయానని తెలుసుకున్న శ్రీను సైబర్ క్రైం పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు.

యాదాద్రి ఆలయ రికార్డు అసిస్టెంట్ మృతి


మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న గ్యాదపాక బాల్‌నర్సింహ (42) మంగళవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందాడు. ఉదయం శ్వాస ఇబ్బందిగా ఉందని చెప్పడంతో వెంటనే భువనగిరి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షలు చేస్తుండగా మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సందర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

'డిండి' నీటి విడుదల.. రైతుల ఆందోళన

- నీటి విడుదలను తగ్గించిన ఇరిగేషన్ అధికారులు


డిండి మండల కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

డిండి: డిండి ప్రాజెక్టు నుంచి సోమవారం ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేయగా.. నీటి విడుదలను నిలిపివేయాలని పలువురు రైతులు మంగళవారం డిండి మండల కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం ఇరిగేషన్ డీఈ శ్రీనువాసులుకు వినతిపత్రం అందజేశారు. రైతుల ఆందోళనతో డీఈ ప్రాజెక్టు వద్దకు వెళ్లి నీటి విడుదలను సగం వరకు తగ్గించారు. పూర్తిస్థాయిలో నీటి విడుదలను నిలిపివేయాలని రైతులు డీఈపై ఒత్తిడి తీసుకురాగా.. జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడతానని పేర్కొన్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ రాజు తన సిబ్బందితో కలిసి ప్రాజెక్టు వద్దకు చేరుకుని రైతులకు సర్ది చెప్పడంతో సమస్య సద్దుమనిగింది.

భూగర్భ జలాలు పెంచేందుకు..

వానాకాలంలో డిండి ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా నీరు రావడంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి మట్టం 36 అడుగుల వరకు చేరింది. యాసంగి సీజన్‌లో ప్రాజెక్టు ఆయకట్టులో పొలాల సాగుకు నీటిని విడుదల చేయాలని పలువురు రైతులు డిమాండ్ చేయగా.. ఆయకట్టులోని మొత్తం 12750 ఎకరాలకు నీరు సరిపోదని వానాకాలంలో మాత్రమే నీటిని విడుదల చేయాలని మరికొంత మంది రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మెజార్టీ రైతుల అభిప్రాయం మేరకు నీటి విడుదలను ఆపేశారు. ప్రస్తుతం వేసవి కారణంగా బోరు బావుల్లో నీరు అడుగంటిపోవడంతో భూగర్భజలాలను పెంచడంతో పాటు డిండి, చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లోని చెరువులు, కుంటలు నింపడానికి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేశారు. కానీ, డిండి మండల రైతుల అభిప్రాయ సేకరణ లేకుండా ప్రాజెక్టు నుంచి నీటిని ఎలా విడుదల చేస్తారని రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నిల్వ ఉన్న 29 అడుగుల మేర నీరు మొత్తం ఎడమ కాలువ ద్వారా విడుదల చేసినా డిండి, చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లోని చివరి చెరువులు, కుంటల వరకు నీరు చేరుకోదని ఇక్కడి రైతులు పేర్కొంటున్నారు. అదేవిధంగా ప్రాజెక్టు మెయిన్ కెనాల్‌కు ఉన్న పలు డిస్ట్రిబ్యూటరీలకు తలుపులు లేకపోవడంతో విడుదల చేసిన నీటిలో సగం వరకు వృథాగా పోతున్నాయని రైతులు వాపోతున్నారు. వానాకాలం ఆయకట్టు సాగుకు ప్రాజెక్టులో నీరు లేకుండా ఉంటుందని, ప్రస్తుతం నీటిని విడుదల చేయడంతో ఎలాంటి ప్రయోజనం లేదని రైతులు అభిప్రాయపడుతున్నారు.

అమ్మకానికి ఆడ శిశువు

- ఆరుగురి అరెస్ట్, ముగ్గురు పరారీ
- కేసు వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డె

సూర్యాపేట : పసిపాపను అమ్మకానికి పెట్టి.. డబ్బులు సంపాదించాలని చూసిన ముఠా సభ్యుల గుట్టును మునగాల పోలీసులు రట్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాహుల్ హెగ్డె వెల్లడించారు. ఈనెల 15న మునగాల మండల పరిధిలోని మొద్దులచెరువు స్టేజి వద్ద ఘర్షణ జరుగుతుందని స్థానికులు ఇచ్చిన సమాచారంతో మునగాల పోలీసులు అక్కడకు వెళ్లారు. వెళ్లి వారిని విచారిస్తుండగా నిందితులు పారిపోవడానికి ప్రయత్నం చేయగా అదుపులోకి తీసుకుని మరింతగా విచారించారు. విచారణలో నల్లగొండ జిల్లా తిరుమలగిరి సాగర్ మండలం నాయకునితండా గ్రామానికి చెందిన మేరావాత్ పూల్‌సింగ్ కూతురు రాజేశ్వరికి మొదటి సంతానంలో ఆడపిల్ల పుట్టగా తిరిగి రెండో సంతానంలో కూడా 20రోజుల క్రితం ఆడపిల్లకు జన్మనిచ్చింది. రాజేశ్వరి కి ఇద్దరు ఆడపిల్లలు సంతానం కలగడంతో ఆమెకు ఆర్థికంగా ఇబ్బంది అవుతుందని భావించిన పూల్‌సింగ్ పుట్టిన పాపను పిల్లలు లేని వారికి అమ్మి డబ్బులు సంపాదిస్తే నా కూతురు బాగు పడుతుందని భావించాడు. ఈ నేపథ్యంలో తన కూతురు రాజేశ్వరికి విషయం చెప్పకుండా తన మేనకోడలు మేరావత్ దుర్గ సహకారంతో ముడావత్ రాజానాయక్‌తో పిల్లలను దత్తత చేసుకొనే వారి గురించి ఆరా తీసి పాపను అమ్మగా వచ్చిన డబ్బులలో కొంత డబ్బు తనకు ఇచ్చే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నాడు. పూల్‌సింగ్, దుర్గతో కలిసి ముడావత్ రాజానాయక్ తనకు పరిచయం ఉన్న శివనేని నాగమణితో ఒప్పందం చేసుకున్నారు. రాజానాయక్, నాగమణి ఇద్దరు కలిసి విజయవాడకు చెందిన గరికముక్కు విజయలక్ష్మి, వాడపల్లి అశోక్‌కుమార్ మధ్యవర్తులుగా రూ.3లక్షలకు అమ్మేటట్లు ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందంలో భాగంగా పాపను మునగాల మండలంలోని మొద్దులచెరువు స్టేజి వద్దకు తీసుకురావాలని రాజానాయక్, నాగమణి కోరడంతో పూల్‌సింగ్, దుర్గలు పాపతల్లి రాజేశ్వరికి మాయమాటలు చెప్పి ఆమెతో పాటు ఈనెల 15న మొద్దులచెరువు స్టేజి దగ్గరలో గల ఖాళీ స్థలంలోకి వచ్చారు. ఆ సమయంలో పూల్‌సింగ్ తన కూతురు రాజేశ్వరి చేతుల నుంచి పాపను బలవంతంగా లాక్కొని విజయలక్ష్మి, అశోక్‌కుమార్‌లకు ఇవ్వడంతో రాజేశ్వరి గట్టిగా ప్రశ్నించగా మీ పాపను మీనాన్న మాకు రూ.3లక్షలకు అమ్మాడని చెప్పడంతో రాజేశ్వరి రోధించింది. తన పాపను తన దగ్గరకు తీసుకొనే ప్రయత్నం చేయగా వాళ్లు ఇవ్వకపోవడంతో గట్టిగా కేకలు వేయగా చుట్టుపక్కల వారు చూసి అక్కడికి వెళ్లి విషయం తెలుసుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకోవడంతో వారిని చూసి నిందితులు పారిపోతుండగా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. విచారణలో ఆడపిల్లను అమ్మే ప్రయత్నం చేసినట్లు ఒప్పుకోగా.. నిందితులపై మునగాల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుల నుంచి ఆరు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పల్నాడు జిల్లాకు చెందిన షేక్ సాయిబీ, విజయవాడకు చెందిన బలగం సరోజ, మచిలీపట్నంకు చెందిన గంజల సింధు, హైదరాబాద్‌కు చెందిన నరేష్‌లు పరారీలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్బీ సీఐ వీరరాఘవులు, మునగాల సీఐ డి.రామకృష్ణారెడ్డి, మునగాల ఎస్ఐ అంజిరెడ్డి, సాయిప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

దొంగను పట్టుకున్న గ్రామస్తులు

భువనగిరి క్రైం : ఇంట్లో చోరీకి పాల్పడుతూ పట్టుబడ్డాడు ఓ దొంగ. మంగళవారం రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి గ్రామానికి చెందిన కొత్త సుమన్ రాయగిరిలో సోడాలు అమ్ముకుంటూ సోమ రాధాకృష్ణ ఫంక్షన్‌హాల్ సమీపంలో కిరాయికి ఉంటున్నాడు. రోజువారీగా ఇంటికి తాళం వేసి సోడాలు అమ్మేందుకు వెళ్లిన సమన్. అదే సమయంలో భువనగిరి పట్టణంలోని సంతోష్‌నగర్‌కు చెందిన దండు శ్రీను సుమన్ కిరాయికి ఉంటున్న ఇంటి తాళాన్ని పగులగొట్టి ఇంట్లో ఉన్న రూ.2,800 దొంగిలించాడు. కాగా ఈ దొంగతనాన్ని పక్కింట్లో ఉన్న వ్యక్తి గమనించి ఇంటి యజమానికి, స్థానికులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే వారు వచ్చి దొంగ ఇంట్లోనే ఉండగా పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం రూరల్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

కొండపైనే వాహనాల పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ సన్నిధిలోనే వాహన పూజలు నిర్వహించేలా ఈఓ భాస్కర్‌రావు చర్యలు తీసుకున్నారు. ఈనేపథ్యంలో కొండపై గతంలో ఉన్న బాలాలయం, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో అనువైన స్థలం కోసం మంగళవారం పరిశీలన చేశారు. ఆయా ప్రాంతాలకు చెందిన భక్తులు వాహనాలు కొనుగోలు చేసి పూజలు జరిపించే స్థలాన్ని కొండపైనే ఏర్పాటు చేయాలని పలువురి నుంచి వచ్చిన విజ్ఞప్తులతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం కొండ కింద శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం వద్ద వాహన పూజలను కొనసాగిస్తున్నారు.

యాదాద్రిలో నేడు సీతారాముల కల్యాణం

- శివాలయంలో వైభవంగా ఎదుర్కోలు ఉత్సవం


పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఆలయ అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి దంపతులు

యాదగిరిగుట్ట : శ్రీరామ నవమిని పురస్కరించుకొని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శివాలయంలో శ్రీసీతారామచంద్రస్వామి వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఎదుర్కోలు ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయంలో శ్రీసీతారామచంద్రస్వామి వార్లను ప్రత్యేక సేవపై ఊరేగించారు. అనంతరం ఆలయ మండపంలో సీతాదేవి – శ్రీరాముడి పక్షాన ఆలయ అధికారులు, వేద పండితులు, పారాయణీకులు, అర్చకులు, పూజారులు వేర్వేరుగా కూర్చొని కల్యాణ వేడుకకు సమయాన్ని నిర్ణయించారు. అనంతరం నివేదన, నీరాజన, మంత్ర పుష్పములు జరిపించి, ఎదుర్కోలు ఉత్సవానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు శ్రీసీతారాముల కల్యాణం..

వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివాలయంలో బుధవారం శ్రీసీతారామచంద్రస్వామి వార్ల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు పూజారులు, వేద పండితులు అన్ని ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 12గంటలకు శివాలయ కల్యాణ మండపంలో సీతారాముల కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గురువారం శ్రీసీతా రామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవాన్ని మధ్యాహ్నం 12.30గంటలకు శివాలయంలో నిర్వహించనున్నారు.

రేవంత్ ఆటలో కోమటిరెడ్డి బ్రదర్స్ పావులు

- బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్



మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్, బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్: భువనగిరి లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తేనే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ఆశ చూపాడని, రేవంత్‌రెడ్డి ఆడుతున్న రాజకీయ చందరంగంలో కోమటిరెడ్డి బ్రదర్స్ పావులుగా మారారని బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తనకు మంచి మిత్రుడే అని, కానీ సీఎం రేవంత్‌రెడ్డి మంత్రి పదవి ఆశ చూపడంతో తనపై పరుష పదజాలం ఉపయోగించడం సరికాదన్నారు. తాను భువనగిరి ఎంపీగా ఉన్న సమయంలో రూ.9వేల కోట్ల నిధులు తెచ్చానని, రాజగోపాల్‌రెడ్డి ఎంపీగా ఉండి ఏం తెచ్చాడని ప్రశ్నించారు. ఎంపీ, ఎమ్మెల్యే పదవి రాజగోపాల్‌రెడ్డి వ్యాపారాలకు విజిటింగ్ కార్డుగా పనికొస్తుందన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే 6 నెలల్లో ఎయిమ్స్ పూర్తిచేయిస్తానని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం, ఉదయ సముద్రం ఎందుకు పూర్తిచేయలేదో చెప్పాలన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నుంచి నక్కలగండి, చర్లగూడెం, శివన్నగూడెం రిజర్వాయర్లకు నీరు రాకుండా రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నాడన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం గతంలో ఆయన ఎంపీగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధికి సంబంధించిన వివరాలతో రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో బీజేపీ నల్ల గొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ నేత గోలి మధుసూదన్‌రెడ్డి, పోతెపాక సాంబయ్య, పిల్లి రామరాజు పాల్గొన్నారు.